Crime Mirror
QR Code

https://epaper.
crimemirror.com/

# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

హైదరాబాద్
2-12-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక: 20

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## మద్యం మత్తు.. ఆపై అతివేగం

మూడు బైక్‌లు, ఆటోను ఢీకొట్టిన కారు

ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతుల దుర్మరణం

మరో నలుగురికి గాయాలు..

తల్లిదండ్రుల మృతితో అనాథలైన ఇద్దరు పిల్లలు



## బహిరంగ చర్చకు రండి..

చార్జిషీట్ సంగతి తేలుస్తాం

మీ పదేళ్ల పాలన.. మా ఏడాది పాలనపై చర్చించేందుకు వస్తారా?

బీఆర్ఎస్, బీజేపీలు కవల పిల్లలని మరోమారు రుజువైంది: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఫైర్

మిగతా 2లో

# సంక్రాంతి తర్వాత రైతు భరోసా..

### అసెంబ్లీలో చర్చించి విధివిధానాల ఖరారు.. మారీచులు చెప్పే అబద్ధాలను నమ్మొద్దు

- గత ప్రభుత్వం ఎగ్గొట్టిన 2023 వానాకాలం
- రైతుబంధు సాయాన్ని మేం చెల్లించాం
- 7,625 కోట్లను తొలి విడతగా అందించాం
- మేం వచ్చేనాటికి రూ.7లక్షల కోట్ల అప్పులు
- ఐనా.. రుణమాఫీ పథకాన్ని అమలు చేశాం
- నాలుగు విడతల్లో 20,616.89 కోట్ల మాఫీ
- బీఆర్ఎస్ చేసింది కేవలం రూ.3,331 కోట్లే
- సన్న ధాన్యానికి వచ్చే సీజన్‌లోనూ బోనస్
- కిషన్‌రెడ్డి.. హామీలపై ప్రత్యేకంగా చర్చిద్దాం
- మోదీ చేసిందీ.. మేం చేసిందీ తేలుద్దాం
- ఎన్నో విజయాలు సాధిస్తుంది: సీఎం రేవంత్



అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర రైతాంగానికి రైతు భరోసా పథకాన్ని అందించి తీరతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదన్నారు. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో భరోసా సొమ్మును జమ చేస్తామని తెలిపారు. ఈ పథకం అమలుకు సంబంధించి విధివిధానాలను ఖరారు చేసేందుకు ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని గుర్తు చేశారు. ఉపసంఘం చేసే సూచనలపై ఈ నెలలో నిర్వహించే శాసనసభ సమావేశాల్లో చర్చించి, విదివిధానాలను ఖరారు చేస్తామన్నారు.

2లో

హైదరాబాద్: సోనియాగాంధీ గ్యారెంటీగా చెబుతున్నానని, ఈ విషయంలో ఏ మారీచులు వచ్చి అబద్ధాలు చెప్పినా నమ్మవద్దని అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఎం మాట్లాడారు. రైతుభరోసా పథకంపై ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలను మారీచులు, రాక్షసులతో పోల్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నవంబరు 28 నుంచి 30 వరకు నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకు మంచి ఆదరణ వచ్చిందన్నారు.



# ఏడుగురు మావోయిస్టుల మృతి

### ఘటనా స్థలంలో ఏగోలపు మల్లయ్య మృతదేహం

**ఆదివారం ఉదయం 6.15 గంటలు. అప్పటిదాకా పక్షుల కిలకిలారావాలు వినిపించిన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక సమీప పోలకమ్మ వాగు అటవీ ప్రాంతంలో ఉన్నట్టుండి తుపాకులు గర్జించాయి. మావోయిస్టులు-గేహౌండ్స్ బలగాల మధ్య భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది.**

వరంగల్/ఏటూరు నాగారం: ఈ ఘటనలో ఏడుగురు మావోయిస్టులు మరణించినట్లు ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ ప్రకటించారు. మృతుల్లో తెలంగాణకు చెందిన ఒక మావోయిస్టు ఉండగా మిగతా ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని ఆయన తెలిపారు. ఎస్పీ కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నవంబర్ 21న రాత్రి ములుగు జిల్లా వాజేడులో ఉయికే రమేష్, ఉయికే అర్జున్‌లను ఇన్‌ఫార్మర్ల పేరిట మావోయిస్టులు హత్య చేశారు. ఈ నేపథ్యంలో గ్రౌహౌండ్స్ బలగాలు ములుగు జిల్లా అడవుల్లో కూంబింగ్ ముమ్మరం చేశాయి.

- మిగతా 2వ పేజీలో



## కనీసం ముగ్గురిని కనండి

జనాభా క్షీణిస్తే సమాజమే అంతరిస్తుంది!

భాషలు, సంస్కృతి కూడా కనుమరుగవుతాయి

ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలు

- మిగతా 2వ పేజీలో

## మహా సీఎం ఫడణవీస్?

బీజేపీ సీనియర్ నేత వెల్లడి..

మోదీ, షాలదే తుది నిర్ణయమన్న శిందే

ముంబైలో నేడు మహాయుతి భేటీ




## త్వరలోనే కొత్త వక్ఫ్‌బోర్డు

వక్ఫ్ ఆస్తులను రక్షించలేకపోయిన పాత బోర్డు

అందుకే రద్దుచేశాం: రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి: వారం, పది రోజుల్లో నూతన వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు కూటమి ప్రభుత్వం తెలిపింది. ముందుగా అర్హులైన సభ్యులతో కొత్త బోర్డును ఏర్పాటు చేస్తామని, అనంతరం సమర్థుడైన వ్యక్తిని చైర్మన్‌గా సభ్యులు ఎన్నుకొంటారని పేర్కొంటూ



- మిగతా 2వ పేజీలో





# మద్యం మత్తు.. ఆపై అతివేగం

మెహిదీపట్నం: మద్యం మత్తు ఆపై అతివేగం.. అదుపు తప్పిన కారు.. విధ్వంసం సృష్టించింది. ఓ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. ఇంటి నుంచి పిల్లల కోసం ఆహారం తెద్దామని బయటకు వచ్చిన దంపతులు దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాదంలో మరో నలుగురికి గాయాలయ్యాయి. లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్ నుంచి మెహిదీపట్నం వైపు వేగంగా వెళ్తున్న కారు.. దర్గా సమీపంలోకి రాగానే అదుపు తప్పి మూడు బైక్‌లను, ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లంగర్‌హౌస్ గొల్లబస్తీలో నివసించే దినేశ్(35), అనితా ఠాకూర్ (35) దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. లంగర్‌హౌస్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను మార్చురీ తరలించారు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కాగా, లంగర్‌హౌస్ గొల్లబస్తీలో నివసించే అనితా ఠాకూర్, దినేశ్ దంపతులు తమ ఇద్దరు పిల్లలు ప్రేరణ శ్రీ(12), దితి శ్రీ(10)తో కలిసి నాలుగు రోజుల కిందట గోవాకు వెళ్లి..శనివారం రాత్రి తిరిగి వచ్చారు. అయితే దంపతులు పిల్లలకు రాత్రి భోజనం తీసుకొచ్చేందుకు ద్విచక్రవాహనంపై బయటకు వచ్చారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యానికి బలయ్యారు. తల్లిదండ్రుల మృతితో వారి పిల్లలు అనాథలయ్యారు.

రాత్రి ఎనిమిదయ్యిందంటే..

సిటీబ్యూరో: రోడ్లపై రయ్యిమంటూ వేగంగా వెళ్లే వాహనాలు%ౌ% ఒకరు తాగి వేగంగా నడిపితే.. మరొకరు నిర్లక్ష్యంగా డేంజరస్ డ్రైవింగ్ చేస్తున్నారు. ఇలాంటి వాళ్లను కట్టడి చేయాల్సిన ట్రాఫిక్ పోలీసులు రాత్రి 8 అయ్యిందంటే రోడ్లపై కనిపించరు. ఇంకేముంది రోడ్లపై డేంజరస్ డ్రైవింగ్ చేసేవాళ్లతో అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. లంగర్‌హౌస్‌లో ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతులను మద్యం మత్తులో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో వారు మృతి చెందారు. ఆ రూట్‌లో శనివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ జరిగి ఉంటే ప్రమాదం సంభవించేది కాదు. కనీసం ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై కనిపించినా.. ఉల్లంఘనదారుల్లో భయం అనేది ఉండేది.

# కనీసం ముగ్గురిని కనండి

(మొదటి పేజీ తరువాయి)

నాగపూర్: ప్రతి భారతీయ కుటుంబం కనీసం ముగ్గరేసి పిల్లలను కనాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ పిలుపిచ్చారు. జనసంఖ్య క్షీణిస్తే సమాజమే అంతరిస్తుందని హెచ్చరించారు. ఆయన ఆదివారమిక్కడ నాగపూర్‌లో నిర్వహించిన 'కథాలే కుల్ సమ్మేళన్'లో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత జనాభా విధానం పాతికేళ్లనాటిదని.. 1998లో లేదా 2002లో ఖరారు చేశారని.. జన సంఖ్య వృద్ధి రేటు 2.1కి తగ్గకూడదని అందులో స్పష్టం చేశారని గుర్తుచేశారు. 'కుటుంబం సమాజంలో భాగం. ప్రతి కుటుంబం ఓ యూనిట్. జనాభా తగ్గుదల ఆందోళన కలిగించే అంశం. వృద్ధి రేటు 2.1కి తక్కువగా ఉంటే. సమాజం అంతరించిపోతుంది. ఆ పరిస్థితుల్లో దానినెవరూ నాశనం చేయనక్కర్లేదు. తనంత తానే నాశనమవుతుంది. భాషలూ కనుమరుగవుతాయి. సంస్కృతీ నశిస్తుంది. ప్రతి జంటా ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను.. కనీసం ముగ్గురిని కనాలి. ఈ విషయాన్ని జనసంఖ్య శాస్త్రమే చెబుతోంది. సమాజం మనుగడ సాగించాలంటే పిల్లల సంఖ్య ముఖ్యం' అని భాగవత్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణ, మతపరమైన జనాభా.. ఈ రెండు అంశాలూ విస్మరించడానికి వీల్లేనివని చెప్పారు. గతంలో నాగపూర్‌లోనే జరిగిన దసరా ర్యాలీలో కూడా ఆయన జనాభా పెరుగుదల అవసరాన్ని నొక్కిచెప్పారు. ప్రతి కోణంలో ఆలోచించి అన్ని వర్గాలకు వర్తించేలా నూతన జనాభా విధానాన్ని రూపొందించాలని ఆ సందర్భంగా అన్నారు. వివిధ వర్గాల జనాభాలో అసమతుల్యం.. భౌగోళిక సరిహద్దులనూ ప్రభావితం చేస్తుందని తెలిపారు. 'జనాభా అత్యధికంగా ఉంటే భారం ఎక్కువగా ఉంటుందన్నది నిజమే. కానీ జనాభాను సక్రమంగా వినియోగించుకుంటే అదో వనరుగా మారుతుంది. 50 ఏళ్ల తర్వాత మన దేశం ఎంత మందికి ఆహారం అందించగలుగుతుందనేది కూడా పరిగణనలోకి తీసుకోవాలి' అని భాగవత్ అభిప్రాయపడ్డారు. మహిళను తల్లిగా పరిగణించడం మంచిదేనని.. అయితే వారిని ఇళ్లలో నాలుగు గోడలకే పరిమితం చేయడం మంచిది కాదని చెప్పారు.


# బహిరంగ చర్చకు రండి..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జిషీట్ అంటూ బీజేపీ చేస్తున్న హడావుడి చూస్తుంటే గురివింద సామెత గుర్తుకు వస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన, కేంద్రంలో బీజేపీ పదేళ్ల పాలనపై ఆ పార్టీ నేతలు తమతో బహిరంగ చర్చకు వస్తే చార్జిషీట్ సంగతి తేలుస్తామని వ్యాఖ్యానించారు. తమతో చర్చకు వచ్చే సత్తా బీజేపీ నేతలకు ఉందా అని మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది కాలంలో తెలంగాణలో అమలవుతోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై తాము చర్చకు రెడీగా ఉన్నామని చెప్పారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామని, నల్లధనం తెచ్చి ప్రతి అకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తామని, వంద రోజుల్లో అన్ని ధరలు తగ్గిస్తామని, డాలర్‌కు పోటీగా రూపాయి విలువ పెంచుతామని, నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని, రూ.50కే లీటర్ పెట్రోల్ ఇస్తామని చెప్పిన బీజేపీ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అప్రజాస్వామికంగా వ్యవహరించి ప్రభుత్వాలను కూల్చా రని, దేశ వ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన 411 మంది ఎమ్మెల్యేలను చేర్చు కున్న బీజేపీ నేతలు తమకు సుద్దులు చెబుతారా అని ప్రశ్నించారు. 45 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా దేశంలో నిరుద్యోగ తీవ్రత ఉందని గుర్తు చేశారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన మేనిఫెస్టోను తీసుకొని ఆ పార్టీ నేతలు వస్తే, తమ 2023 ఎన్నికల మేనిఫెస్టోను తీసుకొని తాము వస్తామని, ఏడాదిలో ఏం చేశామో తాము చెబుతామని, పదేళ్లలో ఏం చేశారో బీజేపీ నేతలు చెప్పాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటేనని మరోమారు రుజు వైందని, సమయం వచ్చినప్పుడల్లా ఆ పార్టీలు ఏ టీం, బీ టీంలా వ్యవహరి స్తాయని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకున్నందుకే తెలంగాణలో బీజేపీ అడుగంటిపోతోందని, ఇప్పుడు చార్జిషీట్ అంటూ కొత్త డ్రామాకు తెరలేపారని ఎద్దేవా చేశారు. ఆ రెండు పార్టీలు కవల పిల్లల్లాంటివని ఈ చార్జిషీట్‌తో రుజువైందన్నారు. ఏడాదిగా తాము చేస్తున్న కార్యక్రమాలేవీ బీజేపీ నేతలకు కనపడడం లేదా అని మహేశ్‌గౌడ్ ప్రశ్నించారు.

# సంక్రాంతి తర్వాత రైతు భరోసా..

రైతుల ఆశీర్వాదం, సంపూర్ణ మద్దతుతో ఈ ప్రభుత్వం ఇంకా తొమిదేళ్లు ఎన్నో వియాలు సాధిస్తుందని తనకు సంపూర్ణ విశ్వాసం కలిగిందన్నారు."తెలంగాణ



ఏర్పడే నాటికి ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో, రూ.69 వేల కోట్ల అప్పులతో కేసీఆర్‌కు రాష్ట్రాన్ని అప్పగించింది. అలాంటి రాష్ట్రాన్ని 2023 డిసెంబరులో కాంగ్రెస్ మళ్లీ అధికారం చేపట్టే నాటికి రూ.7 లక్షల కోట్ల అప్పు, ప్రతినెలా వడ్డీలు, అసలు కలిపి రూ.6,500 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితికి తీసుకువచ్చారు." అని సీఎం రేవంత్ అన్నారు. ప్రజలపై అప్పుల భారం మోపలేదని, అద్భుతమైన పరిపాలనను అందిస్తున్నామని, రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చామని అప్పటి ప్రభుత్వం సందర్భం వచ్చినప్పుడల్లా దాడులు చేసిందని ఆరోపించారు. అందుకే తాము అధికారం చేపట్టిన తరువాత ఆస్తులు, అప్పులు, విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులపై వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించేందుకు శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు. అప్పులను చూసి అ?ధైర్యపడకుండా.. ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తున్నామని చెప్పారు.

అన్ని పథకాలను తెచ్చింది కాంగ్రెస్సే..

రైతులకు హరిత విప్లవం, సాగునీరు, ఉచిత విద్యుత్, రాయితీతో ఎరువులు, పండిన పంటలకు సబ్సిడీ, ఆహార భద్రత చట్టం, పంటలకు మద్దతు ధర, ఉపాధి హామీ పథకం దాకా కాంగ్రెస్ పార్టీయే అమల్లోకి తెచ్చిందని సీఎం రేవంత్ చెప్పారు. రైతులు, రైతు కూలీలను దృష్టిలో పెట్టుకుని వాటికి చట్టబద్ధత కల్పించిందన్నారు. అయితే వీటివల్ల రైతుల జీవితాల్లో మార్పులు పూర్తిస్థాయిలో రాలేదని, గత పాలకుల నిర్లక్ష్యం, అకాల వర్షాలు, కరువు ఇందుకు కారణమని అన్నారు. అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం ఎగ్గొట్టిన 2023 వానాకాలం రైతుబంధు సాయాన్ని తాము అందజేశామని చెప్పారు. 2024 జనవరిలో ప్రారంభించి మార్చి వరకు రూ.7,625 కోట్లను మొదటి విడతగా అందించామన్నారు. ఆ తరువాత ఆగస్టు 15 వరకు రుణమాఫీ చేస్తామని రైతులకు మాట ఇచ్చామని, దాని ప్రకారం 25 రోజుల్లోనే రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలను నాలుగు విడతల్లో కలిపి 25,35,964 మంది రైతు కుటుంబాలకు రూ.20,616.89 కోట్ల రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏ రాష్ట్రంలోనూ ఎవరూ ఇప్పటివరకు ఇంత తక్కువ కాలంలో ఇంత పెద్దమొత్తంలో రుణమాఫీ చేయలేదని అన్నారు.

**బీఆర్ఎసకు అర్హత లేదు..**

రికార్డు స్థాయిలో తాము రుణమాఫీ చేసినా.. బీఆర్ఎస్ నాయకులు పదే పదే ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ ఏం చెప్పిందో ఓసారి గుర్తు చేసుకోవాలన్నారు. 2014లో రూ.లక్ష రుణమాఫీ హామీ ఇచ్చి.. నాలుగు విడతల్లో చేస్తామని చెప్పారని, వడ్డీ కూడా చెల్లిస్తామన్నారని గుర్తు చేశారు. మళ్లీ 2018లోనూ రూ.లక్ష రుణాన్ని ఒకేసారి మాఫీ చేస్తామని చెప్పి.. చేయలేదన్నారు. చివరకు 2023 ఎన్నికలు సమీపించే సమయానికి ఔటర్ రింగు రోడ్డును అమ్మి.. హడావిడిగా చేశారని, అది కూడా 21,35,557 మంది రైతులకు రూ.11,909.31 కోట్లను మాత్రమే మాఫీ చేశారని తెలిపారు. నాలుగున్నరేళ్ల తరువాత మాఫీ చేయడం ద్వారా రూ.లక్ష రుణం ఉన్నవారికి వడ్డీకే రూ.8,578.97 కోట్లు చెల్లించాల్సి వచ్చిందన్నారు. దీంతో వడ్డీలకు పోను రూ.3,331 కోట్లే అసలు కింద జమ అయిందన్నారు. కానీ, ఏడాది కూడా కాకముందే దాదాపు రూ.20,616 కోట్ల మేర రుణమాఫీ చేసిన తమను తప్పుబట్టాలని, రైతుల ముందు దోషిగా నిలబెట్టాలని ఉబలాటపడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అన్నీ తెలుసునని, వారు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో పూర్తిస్థాయిలో మాఫీ చేయని రూ.లక్ష రుణాలు రైతులు రెన్యువల్ చేసుకున్నవేనని, ఈ విషయం తాము చేసిన రుణమాఫీలో తేలిందని తెలిపారు. అందుకే 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు తీసుకున్న రుణాలను తాము చెల్లించామని చెప్పారు. రేషన్‌కార్డు లేకపోతే రుణమాఫీ జరగబోదనేది అవాస్తవమని, భూమి ఉండి, రుణం ఉండి అర్హులైన వారందరికీ మాఫీ అవుతుందని స్పష్టం చేశారు.

# త్వరలోనే కొత్త వక్ఫ్‌బోర్డు

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. "గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటైన వక్ఫ్ బోర్డు, వక్ఫ్ ఆస్తులు పరిరక్షించడంలో పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించింది. పాలనా కార్యకలాపాలను కూడా విస్మరించింది. పైగా న్యాయ వివాదాల్లో చిక్కుకుంది. దీనిపై దాఖలైన పెండిగ్ వ్యాజ్యాలలో హైకోర్టు సూచనల మేరకు చర్యలు తీసుకున్నాం. వక్ఫ్‌బోర్డును రద్దు చేశాం. గత ప్రభుత్వం తెచ్చిన జీవో నం.47కు ఉపసంహరించాం" అని ఆ ప్రకటనలో తెలిపింది.

**జీవో నం.47 ఉపసంహరణకు కారణాలివే...**

గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా విడుదల చేసిన జీవోల్లో జీవో నం.47 ఒకటి. ఈ జీవోకు వ్యతిరేకంగా కోర్టుల్లో 13 రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి. ముస్లిం మైనారిటీల్లో ప్రధాన సమూహాలైన సున్నీలు, షియాలకు వక్ఫ్‌బోర్డులో ప్రాతినిధ్యం లేకుండాపోయింది. మాజీ ఎంపీలను బోర్డులో చేర్చుకోలేదు. జూనియర్ న్యాయవాదులను ఎంపిక చేయడం సీనియర్ న్యాయవాదులతో వివాదాలకు దారి తీసింది. వివిధ కోర్టుల్లో కేసుల కారణంగా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎన్నిక జరగలేదు. మార్చి 2003 నుంచి బోర్డు కార్యకలాపాలు స్తంభించాయి. వక్ఫ్‌బోర్డు దీర్ఘకాలికంగా పని చేయకపోవడం, దాని చట్టబద్ధతను ప్రశ్నిస్తూ రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జీవో నం.47ను రద్దుచేసింది. కూటమి ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు వ్యవస్థనే పూర్తిగా రద్దు చేసినట్టు కొన్ని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అ?ధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ తెలిపారు. సీఎం చంద్రబాబు, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్... మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారికి అండగా ఉంటున్నారని పేర్కొన్నారు.

# మహా సీఎం ఫడణవీస్?

(మొదటి పేజీ తరువాయి)

ముంబై, డిసెంబరు1: మహారాష్ట్రకు కాబోయే ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీసేనని, ఒకటి రెండు రోజుల్లో లాంఛనంగా ఎన్నికవుతారని బీజేపీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. మరోవైపు నేడు జరిగే మహాయుతి సమావేశంలో ఈ విషయంపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఈ సమావేశానికి బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్, శివసేన అధ్యక్షుడు, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ హాజరవుతారు. మంత్రిత్వ శాఖల కేటాయింపులపై ముగ్గురు నేతలు చర్చిస్తారు. హెూం, పట్టణాభివృద్ధి, పీడబ్ల్యూడీ, ఆర్థిక శాఖలతో పాటు అసెంబ్లీ స్పీకర్ పదవిపై మూడు పార్టీల మధ్య గట్టి పోటీ ఉండటంతో ఈ సమావేశానికి ప్రాధాన్యత అదిరింది. హెూం, స్పీకర్ పదవి విషయంలో బీజేపీ పట్టు వదలడం లేదు. ఈ కారణం వల్లే కొత్త సీఎం ప్రకటన ఆలస్యం అవుతోందని సమాచారం. డిసెంబరు రెండులోగా దీనిపై తేల్చుకోవాలని, లేదంటే తామే నిర్ణయిస్తామని అమిత్ షా మహాయుతి కూటమి నేతలకు స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో శాసనసభాపక్షను ఎన్నుకునేందుకు బీజేపీ ఎమ్మెల్యేలు నేడు లేదా రేపు సమావేశం కానున్నారు. దేవేంద్ర ఫడ్నవీసను బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకుంటారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. సొంతూరుకు వెళ్లిన శిందే తన మౌనాన్ని వీడారు. మహారాష్ట్ర కొత్త ముఖ్యమంత్రి విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షాలదే తుది నిర్ణయమన్నారు. మహాయుతి కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని శిందే స్పష్టం చేశారు. తన ఆరోగ్యం మెరుగుపడిందని చెప్పారు. మహారాష్ట్రలో కొత్తగా ఏర్పడే మహాయుతి ప్రభుత్వంలో ఏక్‌నాథ్ శిందే తనయుడు శ్రీకాంత్ శిందే డిప్యూటీ సీఎం రేసులో ఉన్నారని తెలుస్తోంది.

# ఏడుగురు మావోయిస్టుల మృతి



(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం ఉదయం చెల్పాక అడవుల్లో 10 నుంచి 12 మంది ఆలివ్‌గ్రీన్ దుస్తులు ధరించిన సాయుధ మావోయిస్టులు.. పోలీసు పార్టీలను గుర్తించి వెంటనే కాల్పులు మొదలెట్టారు. ఆయుధాలు వదిలి లొంగిపోవాలని హెచ్చరించినా వినకుండా కాల్పులు కొనసాగించారు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మిగతా వారు పారిపోగా ఘటన స్థలంలో రెండు ఏకే%-%47 రైఫిళ్లు, ఒక జీ%-%6, ఒక ఇన్సాస్, 303 రైఫిళ్లు, మందుగుండు సామగ్రి పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. మృతులను తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఇల్లందు, నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి కుర్సం మంగు అలియాస్ భద్రు, పాపన్న (35), దండకారణ్యం డివిజన్ కమిటీ సభ్యుడు, ఏటూరునాగారం%-%మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు, కోటి, కమలాకర్ (43), ఏరియా కమిటీ సభ్యులు ముస్సాకి దేవల్ అలియాస్ కరుణాకర్ (22), ముస్సాకి జమున (23), పార్టీ సభ్యులు జైసింగ్ (25), కిషోర్ (22), కామేష్ (23)గా పోలీసులు గుర్తించారు. ఏగోలపు మల్లయ్యది తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామం కాగా, మిగతా ఆరుగురు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పాగా వేసేందుకు మావోయిస్టులు ప్రయత్నాలు చేసినప్పటికీ ఆటంకాలు ఎదురయ్యాయి. అయితే 2015 సెప్టెంబర్ 15న ములుగు జిల్లా వెంగళాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ వడ్డేపల్లికి చెందిన ఎంటెక్ విద్యార్థి తంగళ్లపెల్లి శ్రుతి అలియాస్ మహిత, వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం పెంద్యాలకు చెందిన మణికంటి విద్యాసాగర్‌రెడ్డి అలియాస్ సాగర్ మరణించారు. అప్పట్నుంచి సుమారు తొమ్మిదేళ్ల తర్వాత ఆదివారం భారీ ఎన్‌కౌంటర్ జరగడం కలకలం రేపుతోంది. మావోయిస్టు పార్టీ సాయుధ విభాగం పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ఏర్పడి 24 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ రెండురోజుల క్రితమే పిలుపునిచ్చింది. ఈ మేరకు వారోత్సవాలకు సన్నద్ధమవుతున్న సమయంలో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుని ఏకంగా ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం ఆ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

**33 ఏళ్ల తర్వాత మళ్లీ వార్తలకెక్కిన చెల్పాక**

తాజా ఎన్‌కౌంటర్‌తో చెల్పాక పేరు 33 ఏళ్ల తర్వాత మళ్లీ వార్తలకెక్కింది. 1991 జూన్ 21న అప్పటి పీపుల్స్‌వార్, ఇప్పటి మావోయిస్టు పార్టీ నక్సలైట్లు భారీ మందుపాతర పేల్చారు. ఈ ఘటనలో ఏటూరునాగారం సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ కిషోర్‌కుమార్ సహా ఏడుగురు సీఆర్‌పీఎఫ్ పోలీసులు మరణించారు. రాజీవ్‌గాంధీ మరణానంతరం జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల పోలింగ్ రోజునే గ్రామ సమీపాన నక్సలైట్లు ఈ ఘటనకు పాల్పడ్డారు. చెల్పాక పోలింగ్ కేంద్రంలోని బ్యాలెట్ బాక్సుల్లో సిరా పోసి, పథకం ప్రకారం పోలీసులకు సమాచారం చేరవేసి రప్పించిన నక్సల్స్.. ఈ భారీ మందుపాతర పేల్చారు. అదే చెల్పాక సమీప అడవుల్లో తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. భారీ ఎన్‌కౌంటర్ పల్లెల్లో కలకలం రేపింది. ఇన్‌ఫార్మర్ల పేరిట వాజేడులో ఇద్దరి హత్య, ఆదివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌తో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎన్‌కౌంటర్ తర్వాత కూడా పోలీసు బలగాల కూంబింగ్ కొనసాగుతూనే ఉంది. పీఎల్‌జీఏ వారోత్సవాలను భగ్నం చేసేందుకు గొత్తికోయ గూడాలు, అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో జల్లెడ పడుతున్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన పైన పింక్ మీడియాతో

# బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం

### గురుకులాల పైన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పెద్ద కుట్ర కు పాల్పడుతున్నాడు

### మాజీ మంత్రి హరీష్ రావు ప్రజలను రెచ్చ గొడుతున్నారన్నారని ఆరోపణ

### మీడియా సమావేశంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్

### పాల్గొన్న నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజి రెడ్డి



**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి డిసెంబర్ 01 :** సిఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన పైన పింక్ మీడియా తో బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారం చెపిసురున్నదని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ అన్నారు. ఆదివారంనాడు నర్సాపూర్ లోని రాజీ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. గురుకులాల పైన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పెద్ద కుట్ర కు పాల్పడుతున్నాడని ఆరోపించారు. గురుకులాల సెక్రటరీ గా ఉన్నప్పుడు నియమించుకున్న తన మనుషులతో ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నాడని ఘాటుగా స్పందించారు. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల విషయంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నీచానికి పాల్పడుతున్నాడని విమర్శించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి 40 శాతం డైట్ చార్జీలు పెంచి మంచి భోజనం అందిస్తుంటే ఓర్వ లేక ఫుడ్ పాయిజన్ అంటు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలకు నిజాలు తెలుసునని అన్నారు. 10 యేళ్ళ పాటు అధికారంలో ఉండి కనీసం డైట్ ఛార్జ్ లు పెంచలేదని చెప్పారు. తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పినా బీఆర్ఎస్ నేతలు మారడటం లేదని హెద్దేవా చేశారు. 10 సంవత్సరాలుగా అన్ని వర్గాలను మోసం చేసిన బీఆర్ఎస్ నేడు కాంగ్రెస్ పార్టీని బదునామ్ చేస్తుందని ఆరోపించారు. హాస్టల్లో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హాస్టళ్లను దత్తత తీసుకుంటామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు వారి మాటలను, వారి అసత్య ప్రచారాలను ఏ విధంగాను నమ్మే స్థితులో లేరని వారికి సత్య- అసత్యాల గురించి వారికి తెలుసునని అన్నారు. కలెక్టర్ దాడి పైన, సంక్షేమ హాస్టల్లో ఫుడ్ పాయిజన్ పైన రాజకీయ కుట్రలు చేస్తున్నారని చెప్పారు. రైతు పక్షపాతిగా రైతుల సంక్షేమం కోసం పెద్దపీట వేస్తూ ఏడాది కాలంలోనే దేశంలో ఏ రాష్ట్రం ఖర్చు చేయని విధంగా 54,280 కోట్ల రూపాయలను ఖర్చు చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అని పొగిడారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతన్న ఇంట్లో వెలుగులు నింపిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని పొడిగారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మాజీ ఎంపిపి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మండల అధ్యక్షులు మల్లేష్, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు అజ్మాత్, రషీద్, మల్లేష్ యాదవ్, సాగర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మాల సింహ గర్జన సభకు హత్నూర మండలం నుండి బయలు దేరిన మాలలు

**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి డిసెంబర్ 01 :** హైదరాబాద్ లొ తలపెట్టిన మాలల సింహ గర్జనకు హత్నూర మండలంలోని మాలలు బయలు దేరి వెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి భారీ సంఖ్యలో మాల కులస్తులు మాల అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సభకు బయలుదేరె ముందు దౌల్తాబాద్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మాలల ఆత్మగౌరవాన్ని చాటి చెప్పే విధంగా నిర్వహించబోయే ఈ సభకు మండల నుంచి వందలాదిమంది తరంలి వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాల సంఘం జిల్లా నాయకులు శాంత కుమార్, కిష్టయ్య, మండల అధ్యక్షులు రాజీవ్ గాంధీ, మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, మాలల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాల విట్టల్, మాల సంఘం జిల్లా నాయకులు మల్లేశం, అంబేద్కర్ సేవా సమితి జిల్లా కార్యదర్శి గనుకుంట్ల కమలాకర్, అంబేద్కర్ యువజన సంఘం మండల నాయకులు కాసల చిరంజీవి, బహుజన విద్యార్థి సంఘం జిల్లా ఇంచార్జ్ కొప్పు పవన్ కళ్యాణ్, రామకృష్ణ, ఆనంద్, పండు, అభిషేక్, రాజు, అభిషేక్, నాగరాజు, విగ్నేష్, సుధాకర్ తదితరులు తరలి వెళ్లారు.



## ఖమ్మంలో తెలంగాణ జన సమితి పార్టీలో చేరికలు

### తెలంగాణ యూత్ డే పోస్టర్ ఆవిష్కరణ

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా ప్రతినిధి :** ఖమ్మం నగరంలోని 25 కుటుంబాలు తెలంగాణ జన సమితి నగర నాయకులు షేక్ అజీమ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమాని కి టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు హాజరై వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అజీమ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాం తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకే టీజేఎస్ పార్టీని స్థాపించారని రాబోయే ఎన్నికల వరకు పార్టీ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ కన్వీనర్ బట్టు రాజేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ యూత్ డే పోస్టర్ ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టి జి ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మరణం పార్టీకి తీరనిలోటు

### సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్...!



**జగిత్యాలజిల్లా ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి - బాల మల్లేష్ హార్ట్ ఎటాక్ తో మరణించడం. పార్టీకి ప్రజా సంఘాలకు తీరనిలోటు AISFవిద్యార్థి దశ నుండి యువజన నాయకుడిగా CPI జిల్లా సహాయకార్యదర్శి -AIYF రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి గా జాతీయపార్టీ కౌన్సిల్ సభ్యుడుగా పనిచేసారు వారి హటాన్మరణం పార్టీకి తీరనిలోటు అని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ సంతాపాన్ని వ్యక్తం చేసారు...సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్ CPI మండల కన్వీనర్ శనిగరపు ప్రవీణ్, సిపిఐ మండల నాయకులు రాచర్ల సురేష్, బొమ్మెన పురుషోత్తం, సుంకె ప్రకాష్, దుడ్డేలా మల్లేష్, బరిగేలా సురేష్, మంతెన రాజు, మంతెన స్వామిలు సంతాపాన్ని వ్యక్తం చేసారు...

## మంచిర్యాల లో రైతు పండగ కార్యక్రమం

**మంచిర్యాల ప్రతినిధి (క్రైమ్ మిర్రర్ ):** రైతు పండుగ సందర్భముగా జిల్లా సహకార కార్యాలయము మంచిర్యాల లో సహకార సిబ్బందితో సమావేశము నిర్వహించిన సందర్భముగా జిల్లా సహకార అధికారి బి. సంజీవరెడ్డి గారు మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫి గురించి మరియు సంఘాల ద్వార రైతులకు చెల్లించిన ఋణముల గురించి రైతు సంక్షేమ ప్రభుత్వ మని వివరించారు. ఇట్టి సమావేశమునకు జిల్లా సహకార సిబ్బంది పాలుగోన్నారు.




## సింహ గర్జనకు భారీగా తరలిన మునుగోడు మాలలు

### కదం తొక్కిన మునుగోడు మాలలు



**మునుగోడు డిసెంబర్ 1 (క్రైమ్ మిర్రర్) :** హైదరాబాద్ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో జరిగిన మాలల సింహగర్జనకు మునుగోడు మండలం నుంచి వివిధ సంఘాలు,అంబేద్కర్ యువజన సంఘాలు,మాలలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు..ఈ సందర్భంగా మునుగోడు మండల కేంద్రంలో బస్టాండ్ నుండి భారీ ర్యాలీ నిర్వహించి,బాబా సాహెబ్ అంబేద్కర్ కు గజమాలవేసి ఘన నివాళు లర్పించి,బయలుదేరి వెళ్ళారు.. జిల్లా, నియోజకవర్గ ,మండల నాయకులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతి రావు పూలే విద్యాలయం గోల్డెన్ జూబ్లీ వేడుకలు

### 1974 - 2024




**మంచిర్యాల ప్రతినిధి(క్రైమ్ మిర్రర్ ) :** చిన్నగా ప్రా రంబమైన ఆ పాఠశాల ప్రస్థానం నేటికీ యాభై ఏళ్లు పూర్తి చేసుకుంది ఎంతో మంది ఇక్కడ చదివి సమాజ సేవలో ఉన్న వారు ఉన్నారు, ఇక్కడ చదివి ఎక్క డెక్కడో ఉన్నవారు ఆదివారం గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్నారు, అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు, విద్య బుద్దులు నేర్పిన గురువులను సన్మానించారు, ఈ వేడుక తెలంగాణ రాష్ట్రం కు ఆనుకొని ఉన్న మహా రాష్ట్ర లోని బల్లర్ పూర్ (బలార్ష) పట్టణం లోని మహాత్మా జ్యోతి రావు పూలే విద్యాలయం లో నిర్వహించుకున్నారు, తెలంగాణకు ఆనుకొని ఉండటం అక్కడ తీన్ ఎక్క పేపర్ మిల్ ఉండటం తో ఉపాధి కోసం అనేక,మంది తెలుగు వారు అక్కడికి వెళ్లి జీవన ము సాగించేవారు ,ఈ క్రమంలో అప్పుడు 1974 లో తెలుగు హిందీ ఉర్దూ మీడియం లలో విద్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు సమాచారం ,ఈమహారాష్ట్ర లో ఎకైక తెలుగు బోధించే పాఠశాల ఇది ఒక్కటే కావటం విశేషం,ఈ వేడుకకు చీఫ్ గెస్ట్ లు, ప్రెసెంట్ జయంత్ సాల్వ్, సెక్రెటరీ సుభాష్ తాజ్ , శ్రీమతి అపూర్వ తాయి సాల్వే వైస్ ప్రసిడెంట్ ,ప్రత్యేక గెస్ట్ లు శ్రీమతి శాలిని తాయి సాల్వే ఫౌండర్ మరియు వైస్ ప్రసిడెంట్, మనిక్ రావు దూధల్కర్ రిటైడ్ హెడ్ మాస్టర్ ఎం జే ఎఫ్ విద్యాలయం బల్లర్ పూర్ , శ్రీమతి నళిని తా యి సల్వే రిటైడ్ ప్రధానోపాధ్యాయురాలు , ఇప్పుడు కొనసాగుతున్న ప్రదా నోపాద్యాయు డు మక్షుద్ హైమద్, హాజరుకాగా , పూర్య విద్యార్థి ని విద్యార్థులు పాల్గొన్నారు

# “6అబద్ధాలు 66 మోసాలు”

- కాంగ్రెస్ ఏడాది పాలనపై కమలం పోరుబాట
- ఈ నెల 5వరకు నియోజకవర్గంలో నిరసనలు
- కాంగ్రెస్ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదు
- బీఆర్ఎస్ లాగానే కాంగ్రెస్ పాలన
- చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కే.ఎస్ రత్నం



చేవెళ్ల (క్రైమ్ మిర్రర్):బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నిరంకుశ పాలన పయనిస్తోందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కే.ఎస్ రత్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మొయినాబాద్ మండలం హిమాయత్ లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవాలకు నిరసనగా బీజేపీ. .‘6 అబద్దాలు 66 మోసాలు’ పేరుతో రాష్ట్ర అధ్యక్షుడి పిలుపు మేరకు ఈ నెల 5వరకు నిరసన కార్యక్రమాలు ఉంటాయన్నారు. నియోజక వర్గంలో కూడా ఒక్కో రోజు ఒక్కో విధంగా నిరసనలుంటాయిన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదన్నారు. హామీలిచ్చి గెలిచి అమలు మరచి ప్రజలను మోసం చేశారన్నారు. ఒక్క రేషన్ కార్డు ,ఒక్క డబుల్ బెడ్రూం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రాణహిత ప్రాజెక్టు ఊసే ఎత్తడం లేదన్నారు. చేవెళ్లలో రేపు లేదంటే ఎల్లుండి భారీ బైక్ ర్యాలీ నిర్వహించబోతున్నమని,చివరి రోజు చేవెళ్లలో సభ పెడతామన్నారు. ఈ నిరసనలో బీజేపీ శ్రేణులు పెద్ద మొత్తంలో పాల్గొనాలని రత్నం కోరారు. ఈ కార్యక్రమంలో కంజర్ల ప్రకాష్,మధుసూదన్ రెడ్డి,మోర నర్సింహా రెడ్డి,శ్రీనివాస్,ప్రభాకర్ రెడ్డి,మాధపురం శ్రీకాంత్,గణేష్ వార్, రాజమల్లేష్, మాధవ రెడ్డి ఉన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుంది

## రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

### రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో దివ్యాంగులకు ట్రై సైకిల్స్, హియరింగ్ డివైజెస్ అందజేత





**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజా పాలన%-%ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం వికలాంగులకు ట్రై సైకిల్స్, హియరింగ్ డివైస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రవేశపెడుతున్న ప్రతి పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానన్నారు. అర్హులైన వారంతా పథకాలకు ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. తనవంతు బాధ్యతగా అందరికి అండా ఉంటూ వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం 53 వేల ఉద్యోగాలను భర్తీ చేసి నూతన ఆత్మవిశ్వాసం కల్పించిందని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న మౌలిక సూత్రానికి కట్టుబడి తెలంగాణలోని సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం అమలు చేసి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని 317 జీవో కారణంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించామని తెలిపారు. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇవ్వడంతో పాటు పేదలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ సరఫరా చేశామని ముఖ్యంగా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఆరోగ్య శ్రీ పథకాన్ని పది లక్షల రూపాయల వరకు పెంచామని వివరించారు. పదేళ్లల్లో అస్తవ్యస్థంగా మారిన వ్యవస్థలను సరిదిద్ది చరిత్రలో ఎన్నడు లేని విధంగా రెండు లక్షల రూపాయల వరకు రైతు రుణమాఫీ చేశామని తెలిపారు. ఆర్థిక సమస్యలు అధిగమించి హామీలను అమలు చేస్తూ ప్రజల కోసం ప్రభుత్వం పని చేస్తుంటే బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంగీత, సర్కిల్ ఉపకమీషనర్ రవికుమార్, డిపివో యాదగిరి, సీవోలు ఉపేందర్, లక్ష్మణ్, రేణుక, రాజేంద్రనగర్ డిసెబుల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహబూబ్, పలుగు చెరువు మహేష్, సరికొండ వెంకటేష్, ధనంజయ్, అనిల్, లక్ష్మారెడ్డి,కోట పవన్ కుమార్ నేత, జీఎస్ సిద్ధప్ప, తదితరులు పాల్గొన్నారు.


# పోలీస్ కిష్టయ్య త్యాగం మరువలేనిది





తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

**గండిపేట్(క్రైం మిర్రర్):** పోలీస్ కిష్టయ్య చేసిన త్యాగం మరచిపోలేనిదని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. పోలీస్ కిష్టయ్య 14వ వర్ధంతి సందర్భంగా గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద పోలీస్ పుట్టకోక్కుల కిష్టయ్యను స్మరిస్తూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ పోలీస్ కిష్టయ్య చేసిన త్యాగం మార్చిపోలేనిదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మన ముదిరాజ్ బిడ్డ తొలి మరవీరుడుగా ప్రాణ త్యాగం చేయడం తెలంగాణ రాష్ట్ర నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చినందుకు గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ కోదండరామ్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, బిత్తిరి సత్తి, ముదిరాజ్ బంధు మిత్రులు పాల్గొన్నారు.



# ఘనంగా అయ్యప్ప స్వామి 18వ మహాపడి పూజ

**గండిపేట్(క్రైం మిర్రర్):** అయ్యప్ప స్వామి 18వ మహాపడి పూజ ఆదివారం ఘనంగా జరిగింది. నానక్‌రామ్‌గూడ సూరారం దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహాపడి పూజలో పీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి ముఖ్య అతిధిగా హజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప మాల ధరించి ఉన్న భక్తులు ఈర్ష ద్వేషం వీడనాది చిన్న పెద్ద తారత మ్యం లేకుండా ప్రతి ఒక్కరు దైవ దైన్యంలో ఉండాలని ఆ అయ్యప్ప స్వామి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన అన్నారు. నార్సింగి మార్కెట్ కమిటి చైర్మన్ కోట వేణుగౌడ్, గండిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు క్యాతదం అశోక్‌యాదవ్, గంగిడి ఓంప్రకాష్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, లంకల పాపిరెడ్డి, సూరారం శేఖర్‌రెడ్డి, ధర్మగారి మాణిక్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

## రాజేంద్రనగర్ మండల ఆర్‌డివో వెంకట్‌రెడ్డి, ఎంఆర్‌వో రాములు

**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబుద్దులు నేర్పించడం జరుగుతుందని రాజేంద్రనగర్ మండల ఆర్‌డివో వెంకట్‌రెడ్డి, ఎంఆర్‌వో రాములు అన్నారు. ప్రజా పాలన%-%ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజేంద్రనగర్ మండల స్థాయిలో రినెవెబుల్ ఎనర్జీ సోర్సెస్ అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. మండల ఎంఈవో శంకర్‌రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హజరైయ్యారు. ఈ సందర్భంగా ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాజేంద్రనగర్ మండలంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికి ఉపాధ్యాయులు చక్కటి విద్యను అందజేస్తున్నారన్నారు. ఎంఆర్‌వో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల సర్వతోముఖభివృద్ధికి కృషి చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.మాధవి, సుగుణ, జాన్సీరాణి, శ్రీలత, చంద్రశేఖర్రర్, సత్యనారాయణరాజు, కిషన్‌నాయక్, మాణిక్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# మాలల ఐక్యతతోనే వర్గీకరణకు చరమగీతం...!

### సింహ గర్జనకు భారీగా తరలిన నవాబ్ పేట్ మాలలు...!

**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** సికింద్రాబాద్ లో ఇవాళ జరిగే మాలల సింహగర్జన బహిరంగ సభకు ఆదివారం వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం నుండి మాలలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అన్యాయం జరుగుతుందని,వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని మాల మహానాడు మండల నాయకులు అన్నారు.ఎస్సీ వర్గీకరణ పేరుతో విడదీసి పాలిస్తే ఊరుకోమని,మాలలు జాగో కార్యక్రమాన్ని విజయవంతం చేసి భవిష్యత్తు కార్యచరణని ప్రకటిస్తామని చెప్పారు. ఈ సింహగర్జన ర్యాలీలో నవాబ్ పేట్ మండల మాలలు పాల్గొన్నారు.

# ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నాం

## బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్

ఫెబల్‌సిటీలో 5కే రన్.






**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఫెబల్‌సిటీలో 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ లతాప్రేమ్‌గౌడ్, కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్రలు ముఖ్య అతిథులుగా హజరైయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ ప్రజా పాలన%-%ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఫెబల్‌సిటీలో 5కే రన్ నిర్వహించామన్నారు. దీనికి ఫెబల్‌సిటీ వాసులు పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపి రన్‌లో పాల్గొన్నారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రజలు తమ పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, డివిజన్, వార్డు నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

# వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమావాస్య అన్నప్రసాద సేవ

గండిపేట్(క్రైం మిర్రర్): మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అమావాస్య అన్నప్రసాద సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి అమావాస్య రోజున అన్నదానం చేస్తున్నామని వాసవి అసోసియేషన్ అధ్యక్షులు ఓలం యాదగిరి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో ఈ అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారన్నారు.






# రిలయన్స్ సెక్యూరిటీస్‌కు సెబీ గట్టి దెబ్బ

న్యూఢిల్లీ: స్టాక్ బ్రోకర్ నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా రిలయన్స్ సెక్యూరిటీస్‌కు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చెక్ పెట్టింది. స్టాక్ బ్రోకర్ సంస్థకు రూ. 9 లక్షలు జరిమానా చెల్లించవలసిందిగా ఆదేశించింది. ఖాతాలు, రికార్డులు, అధికారిక వ్యక్తుల ఇతర డాక్యుమెంట్లను సెబీసహా స్టాక్ ఎక్స్ఛేంజీలు ఎన్ఎస్ఈ, బీఎస్ఈ థిమాటిక్ ఆన్‌సైట్ పరిశీలన చేపట్టాయి. 2022 ఏప్రిల్ నుంచి 2023 డిసెంబర్‌వరకూ పరిశీలనకు పరిగణించాయి. తదుపరి 2024 ఆగస్ట్ 23న సంస్థకు సెబీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. సెబీ వద్ద రిజిస్టరైన రిలయన్స్ సెక్యూరిటీస్ స్టాక్ బ్రోకర్ నిబంధనలకు అనుగుణంగా ఖాతాలను నిర్వహించవలసి ఉంటుంది. అంతేకాకుండా ఎన్ఎస్ఈఐఎల్ క్యాపిటల్ మార్కెట్ మార్గదర్శకాలు, ఎన్ఎస్ఈ డెరివేటివ్స్ లావాదేవీ నిబంధనలు అమలు చేయవలసి ఉంటుంది. అయితే క్లయింట్ ఆర్డర్ ప్లేస్‌మెంట్స్, తగినవిధంగా వ్యవస్థలను నిర్వహించకపోవడం తదితర నిబంధనల ఉల్లంఘనను గు ర్తించినట్లు 47 పేజీల ఆదేశాలలో సెబీ పేర్కొంది.

# కార్తీక మాసం చివరి ఆదివారం పూజలు



## పాల్గొన్న మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్.

గండిపేట్(క్రైం మిర్రర్): కార్తీక మాసం చివరి ఆదివారం అమావాస్య సందర్భంగా శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించారు. అలాగే పోచమ్మ దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ప్రతి అమావాస్యకు ఉమ్మడి దేవాలయ కమిటి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరిస్తారన్నారు. కోలిచే వారికి కొంగుబంగారంగా నిలిచే అమ్మవారు భక్తులపై ఇంతింతై అంతా తానై భక్తులకు వరాలు ఇచ్చే తల్లిగా అనుగ్రహం ఇస్తున్నారన్నారు. ప్రతి రోజు మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాలకు వస్తారన్నారు. ఈ పూజల్లో మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్, పోతురాజు మల్లేష్ గురుస్వామి, నాగరాజు గురుస్వామి, శేఖర్, మల్లేష్, జగన్, రాజుకుమార్, ప్రవీణ్, సన్నీ, ఆనంద్, మూర్తి, వెంకటేష్, శేఖర్, మోహన్, ఆవుల కృష్ణ, అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.








# తెలంగాణలో విద్యకు మొదటి ప్రాధాన్యత

### తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

**గండిపేట్(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. ప్రజా పాలన%-%ప్రజా విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా గండిపేట మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. హైదర్షాకోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ వ్యాస రచన పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. చక్కగా చదువుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి పరిచి మరిన్ని మెరుగైన వసతులు కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, 16వ డివిజన్ కార్పొరేటర్ షాపురం పుష్పశ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసిన బృందావన్ కాలనీ నూతన కమిటి సభ్యులు



**గండిపేట్(క్రైం మిర్రర్):** కాలనీల అభివృద్ధి కోసం నూతన కమిటిలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బృందావన్ కాలనీ నూతన కమిటి సభ్యులు పెండ్యాల సాయిమాలిక్(శ్రీనివాస సేపవా సమితి చైర్మన్) ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సత్కరించిన కాలనీ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ బృందావన్ కాలనీలో నెలకొన్న అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపిస్తామన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక కార్యచరణ రూపొందించి ప్రణాళిక బద్ధంగా అధునాతన పద్దతిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, శ్రావణ్‌రావు, జె.విజయ్‌కుమార్, టి.విజయ్, జి.శ్రీనివాస్, ఎ.శివ, వెర్రయ్య, నాగరాజు, మనోహర్ తదితరులున్నారు.

# రూపీ.. ఆల్‌టైమ్ లో ఒక్కరోజే 13 పైసలు పతనం

### 84.60 వద్దకు మారకపు విలువ క్షీణత

ముంబై: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ శుక్రవారం ఆల్‌టైమ్ కనిష్ఠానికి దిగజారింది. ఈ ఒక్కరోజే 13 పైసలు పడిపోయి మునుపెన్నడూ లేనివిధంగా భారతీయ కరెన్సీ 84.60 వద్దకు క్షీణించింది. దేశ జీడీపీ వృద్ధిరేటు దాదాపు రెండేండ్ల కనిష్ఠానికి పతనం కావడం.. విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను అదేపనిగా ఉపసంహరించుకుంటుండటం ఓవరాల్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని ఫారెక్స్ మార్కెట్ ట్రేడర్లు తాజా సరళిని విశ్లేషిస్తున్నారు. దీనికితోడు దేశంలోని దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరిగిన డిమాండ్ కూడా రూపీని బలహీనపర్చిందని చెప్తున్నారు. నిజానికి ఇటీవలికాలంలో డాలర్ ముందు రూపీ వెలవెలబోతూనే ఉన్నది. ఒక్కరోజే 10 పైసలకుపైగా క్షీణించిన సందర్భాలు అనేకం ఉన్నాయంటే కరెన్సీ మార్కెట్‌లో రూపాయి ఎదుర్కొంటున్న ఒత్తిడిని అర్థం చేసుకోవచ్చు. రూపాయి విలువ ఇలాగే పడిపోతే ఆ ప్రభావం.. ద్రవ్యోల్బణం, వడ్డీరేట్లు, జీడీపీలపై గట్టిగానే పడవచ్చని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. కోలుకున్న స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల నుంచి దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం కోలుకున్నాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 759.05 పాయింట్లు లేదా 0.96 శాతం ఎగిసి 79,802.79 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 880.16 పాయింట్లు పెరగడం గమనార్హం. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా 216.95 పాయింట్లు లేదా 0.91 శాతం ఎగబాకి 24వేల స్థాయికి ఎగువన 24,131.10 వద్ద నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. రంగాలవారీగా హెల్త్‌కేర్, టెలీకమ్యూనికేషన్స్, ఎనర్జీ, టెక్నాలజీ షేర్లు రాణించాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 0.76 శాతం, మిడ్‌క్యాప్ 0.31 శాతం మేర పుంజుకున్నాయి. గురువారం సెన్సెక్స్ 1,190, నిఫ్టీ 361 పాయింట్లు నష్టపోయిన విషయం తెలిసిందే.

# సబ్బుల ధరలకు రెక్కలు..

# టీ పొడి కూడా..

## 8% వరకు పెంచిన ఎఫ్ఎంసీజీలు

## పామాయిల్ ధరలు పెరగడం వల్లనే..




న్యూఢిల్లీ: సబ్బుల ధరలకు రెక్కలొచ్చాయి. దేశంలో అతిపెద్ద ఎఫ్ఎంసీజీ సంస్థలు అన్ని రకాల సబ్బుల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. పామాయిల్ ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరగడం వల్లనే వీటి ధరలను 7 శాతం నుంచి 8 శాతం వరకు పెంచాల్సి వచ్చిందని హెచ్‌యూఎల్, విప్రో సంస్థలు ప్రకటించాయి. సబ్బుల తయారీలో కీలక ముడి సరుకైన పామాయిల్ ధర అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమన్నది. దీంతో పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడానికి సబ్బుల ధరలు పెంచకతప్పలేదని సంస్థలు పేర్కొన్నాయి. మార్జిన్లు తగ్గుముఖం పట్టడంతో వీటి ధరలను ప్రస్తుత త్రైమాసికంలో పెంచాల్సి ఉంటుందని గత త్రైమాసికపు ఆర్థిక ఫలితాలు సందర్భంగా ప్రకటించాయి కూడా. సబ్బుల తయారీలో కీలక ముడిసరుకైన పామాయిల్ ధరలు గడిచిన ఏడాదికాలంలో 30 శాతం వరకు పెరిగాయని విప్రో కన్స్యూమర్ కేర్ సీఈవో నీరజ్ ఖత్రియా తెలిపారు. మిగతా సంస్థలు కూడా తమ సబ్బుల ధరలను 7-8 శాతం వరకు పెంచుతాయని అనుకుంటున్నట్లు చెప్పారు. గడిచిన మూడు నెలల్లోనే పామాయిల్ ధరలు 35 శాతం నుంచి 40 శాతం వరకు పెరిగాయి. అంతర్జాతీయంగా ధరలు పెరగడంతోపాటు దిగుమతి సుంకం పెరగడం ఇందుకు కారణం. ప్రస్తుతం పది కిలోల పామాయిల్ ధర రూ. 1,370గా ఉన్నది.

**టీ పొడి ధరలు కూడా..**

టీ పొడి ధరలు కూడా పెంచాయి సంస్థలు. అస్థిర వాతావరణ పరిస్థితుల కారణంగా టీ ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం వల్లనే ధరలు సవరించాల్సి వచ్చిందని హెచ్‌యూఎల్, టాటా కన్స్యూమర్ సంస్థలు ప్రకటించాయి. టీ పొడి ధరలను 25 శాతం నుంచి 30 శాతం వరకు సవరించినట్లు టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్ ఇప్పటికే ప్రకటించింది కూడా.


క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

విలేకరులు కావలెను

క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.

93934 46188

# ఐసీసీ అధ్యక్షుడిగా జై షా బాధ్యతలు..

అతిపిన్న వయస్కుడిగా రికార్డు..



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ చైర్మన్‌గా జై షా బాధ్యతలు స్వీకరించారు. ఈ విషయాన్ని ఐసీసీ ఆదివారం ప్రకటించింది. ఈ ఏడాది ఆగస్టులో ఆయన ఐసీసీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అతిపిన్న వయస్కుడు ఆయనే. గతంలో ఆయన భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (%దీజజ×%) కార్యదర్శిగా పని చేసిన విషయం తెలిసిందే. ఇంతకు ముందు ఐసీసీ చైర్మన్ గ్రెగ్ బార్‌క్లే పని చేసిన విషయం తెలిసిందే. ఆయన నాలుగు సంవత్సరాల పాటు అధ్యక్షుడిగా కొనసాగారు. జై షా రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారు. ఐసీసీ అధ్యక్షుడిగా నియామకమైన భారతీయుడు జై షా. ఇంతకు ముందు దివంగత జగ్‌మోహన్ దాల్మియా, శరద్ పవార్, శశాంక్ మనోహర్, పారిశ్రామికవేత్త ఎన్ శ్రీనివాసన్ ఐసీసీ అధ్యక్షులుగా పని చేశారు. ప్రస్తుతం జై షా ముందు సవాళ్లు ఉన్నాయి. దాయాది దేశం పాక్ వేదికగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉంది. ఈ ట్రోఫీ కోసం జట్టును పాక్‌కు పంపేది లేదని భారత్ స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఐసీసీ చైర్మన్‌గా ఆయన వ్యవహరిస్తారు ? హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేందుకు ఆ దేశాన్ని ఒప్పించడం సవాల్‌గా మారనున్నది. కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ సీనియర్ నేత అమిత్ షా తనయుడు జై షా క్రికెట్ అడ్మినిస్ట్రేటర్‌గా తన కెరీర్‌ను 2009లో ప్రారంభించింది. అహ్మదాబాద్‌లోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ క్రికెట్‌లో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పని చేశారు. ఆ తర్వాత సెప్టెంబర్ 2013లో గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ నియామకమయ్యారు. ఆ తర్వాత 2015లో బీసీసీఐ బోర్డ్ ఫైనాన్స్, మార్కెటింగ్ కమిటీ సభ్యుడిగా చేరారు. 2019 అక్టోబర్‌లో బీసీసీఐ సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించారు. అతిపిన్న వయసులో బీసీసీఐ సెక్రెటరీ బాధ్యతలు తీసుకున్నారు. బీసీసీఐ కార్యదర్శి పదవీకాలంలో సౌరవ్ గంగూలీతో పని చేశారు. ఆ తర్వాత రోజర్ బిన్నీతో కలిసి పని చేశారు. ప్రస్తుతం బీసీసీఐ అధ్యక్షుడిగా బిన్నీ కొనసాగుతున్న విషయం తెలిసిందే. 2022లో ఐదేళ్లపాటు ఐపీఎల్ మీడియా హక్కులను రూ.48,390 కోట్లకు విక్రయించేలా జై షా కృషి చేశారు. ప్రతి మ్యాచ్ విలువ ఆధారంగా.. ఎన్ఎఫ్ఎల్ తర్వాత ఐపీఎల్ రెండో అత్యంత విలువైన క్రీడగా తీర్చిదిద్దారు. ఇక 2021లో ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగా పని చేశారు. ఈ ఏడాది జనవరిలో మరోసారి ఆయనకే ఏసీసీ బాధ్యతలు అప్పగించారు. నవంబర్ 2022లో ఐసీసీ ఫైనాన్స్ అండ్ కమర్షియల్ అఫైర్స్ సబ్-కమిటీకి చీఫ్‌గా నియామకమయ్యారు. కామన్వెల్త్ గేమ్స్ తదితర ఈవెంట్లలో క్రికెట్‌ని చేర్చడంలో కీలకపాత్ర పోషించారు.



## రోహిత్ శర్మ కొడుకు పేరు ఎంటో తెలుసా..?

### సోషల్ మీడియాలో నేమ్ రిలీవ్ చేసిన రితికా..!

భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, రితికా దంపతులకు ఇటీవల తనయుడు జన్మించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు రోహిత్ దంపతులు తనయుడి పేరును గానీ, ఫొటోనుగానీ అభిమానులతో పంచుకోలేదు. ఈ క్రమంలో హిట్‌మ్యాన్ అభిమానులంతా ఏం పేరు పెట్టారు? అని తెలుసుకునేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో రితికా తనయుడి పేరును సోషల్ మీడియా వేదికగా రివీల్ చేసింది. రోహిత్ %-% రితికా జంట తనయుడికి 'అహాన్' అని పేరు పెట్టినట్లు ఇన్‌స్టా స్టోరీలో రితికా పేర్కొంది. క్రిస్మస్ నెల ప్రారంభమైన నేపథ్యంలో సెలబ్రేషన్స్ మొదలయ్యా యంటూ పేర్కొంది. ఫొటోలో నాలుగు శాంటాక్లాజ్‌లు ఉండడం విశేషం. ప్రస్తుతం రోహిత్ కుటుంబంలో నలుగురు సభ్యులు ఉన్నారు. ఇప్పటికీ ఈ జంటకు తనయ సమైరా ఉన్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన తనయుడి పేరును రివీల్ చేసిన రితికా.. ఎక్కడ ఆ పేరును పెట్టినట్లు చెప్పకుండా.. శాంటాలకు పేర్లు రాసి షేర్ చేయడం విశేషం. శాంటాలకు రో, రిట్స్, సమ్మి, అహాన్ పేరు రాసి ఉన్న ఫొటోను షేర్ చేయడం అభిమానులను ఆకట్టుకున్నది. ఇక అహాన్ పేరుకు అర్థం ఏంటో తెలుసుకునేందుకు పలువురు అభిమానులు ప్రయత్నించారు. అహాన్ అనే పేరుకు అర్థాలు చాలానే ఉన్నాయి. సూర్యోదయం, ఆశాకిరణం, ఆరంభం అనే అర్థనాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం టీమిండియా ఆస్ట్రేలియాలో పర్యటిస్తుంది. అక్కడ ఐదు టెస్ట్ సిరీస్‌లో తలపడుతున్నది. ఇప్పటికే 1-0తో ఆధిక్యలో ఉన్నది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌కు రోహిత్ దూరమైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రైమ్ మినిస్టర్ లెవెన్‌తో ప్రాక్టీస్ మ్యాచ్ జరుగుతున్నది.రోహిత్ మిడిలార్డర్‌లో దిగి.. మూడు పరుగుల వద్ద అవుట్ అయ్యాడు. ఇక రెండురోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌ని వర్షం కారణంగా 46 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన ప్రైమ్ మినిస్టర్ ఎలెవెన్ 43.2 ఓవర్లలో 240 పరుగులకు కుప్పకూలింది. సామ్ కోన్స్టాస్ (107) రాణించాడు. హన్నో జాకబ్స్ (61) అర్ధ సెంచరీ చేశాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా నాలుగు వికెట్లు, ఆకాశ్ దీప్ 2, సిరాజ్, ప్రసిద్ధ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా తలో వికెట్ దక్కించుకున్నారు. 241 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ప్రస్తుతం 37 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. ఇంకా లక్ష్యానికి 33 పరుగుల దూరంలో ఉన్నది.



## హైబ్రిడ్‌కు ఓకే కానీ.. ఐసీసీ అల్టిమేటంతో వెనక్కి తగ్గిన పీసీబీ

జదుబాయ్/కరాచీ: చాంపియన్స్ ట్రోఫీ(2025) నిర్వహణపై సందిగ్ధత కొనసాగుతూనే ఉన్నది. హైబ్రిడ్ మోడల్ విషయంలో ఐసీసీ అల్టిమేటంకు ఒకింత వెనుకకు తగ్గిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) పలు డిమాండ్లు ముందుపెట్టింది. ఓవైపు హైబ్రిడ్ పద్ధతికి ఓకే అంటూనే వచ్చే మూడేండ్లు భారత్‌లో జరిగే ఐసీసీ టోర్నీలకు ఇదే పద్ధతి వర్తింపజేయాలని షరతులు పెట్టింది. శనివారం చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై పీసీబీ చీఫ్ మోహిసిన్ నక్వీ స్పంది స్తూ ' టోర్నీ నిర్వహణపై నేను అతిగా మాట్లాడాను.అలా చేస్తే పరిస్థితులు ఇంకా క్లిష్టంగా మారుతాయి. మేము మా ప్రతిపాదనలు ఐసీసీ ముందు ఉంచాం, భారత్ కూడా వారి సిఫార్సులు చెప్పింది. ఏ నిర్ణయం తీసుకున్నా..అది అందరికీ సమానంగా ఉండాలి. అంతిమంగా క్రికెట్ గెలువాలన్నదే మా తపన అదే సమయ ంలో పాకిస్థాన్ ఆత్మగౌరవం కూడా ముఖ్యమే' అని అన్నాడు. దీనికి తోడు వార్షిక ఆదాయ వాటాలను కూ డా ఐసీసీ పెంచాలని పీసీబీ డిమాండ్ చేస్తున్నది.

## సయ్యద్ మోడీ టోర్నీ ఫైనల్లో సింధు..

- టైటిల్ పోరుకు లక్ష్యసేన్
- సెమీస్‌లో ఉన్నతిపై అలవోక విజయం



సయ్యద్ మోడి టోర్నీ


లక్నో: సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ సూపర్-300 టోర్నీలో భారత షట్లర్ల హవా కొనసాగుతున్నది. గత కొన్నేండ్లుగా గాయాలకు తోడు ఫామ్‌లేమితో సతమతమవుతున్న స్టార్ షట్లర్ పీవీ సింధు మళ్లీ గాడిలో పడింది. టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లి సత్తాచాటింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో టాప్‌సీడ్ సింధు 21-12, 21-9తో భారత్‌కే చెందిన ఉన్నతి హుడాపై అలవోక విజయం సాధించింది. 36 నిమిషాల్లో ముగిసిన పోరులో సింధు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. తన అనుభవాన్నంత ఉపయోగిస్తూ డ్రాప్‌షాట్లు, నెట్‌గేమ్‌తో ఆకట్టుకుంది. మరోవైపు ఇప్పుడిప్పుడే కెరీర్‌లో నిలదొక్కుకుంటున్న ఉన్నతి..ఒత్తిడికిలోనై అనవసరపు షాట్లతో ప్రత్యర్థికి పాయింట్లు సమర్పించుకుంది. తొలి గేమ్‌లో సింధు 5-3తో ముందంజ వేసింది. పుంజుకునేందుకు ప్రయత్నించే క్రమంలో ఉన్నతి షాట్లను సరైన రీతిలో ఆడలేకపోయింది. దీంతో సీనియర్ షట్లర్ ఆధిక్యం 11-8కు చేరుకుంది. ఇదే అదనుగా విజృంభించిన సింధు..తన ట్రేడ్‌మార్క్ బేస్‌లైన్ స్మాషెస్ జోలికి పోకుండానే ఉన్నతి పనిపట్టింది. రెండో గేమ్‌లోనూ అదే దూకుడు కొనసాగించిన ఈ తెలుగు షట్లర్ వరుస పాయింట్లతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం జరిగే ఫైనల్లో చైనాకు చెందిన యవు లు యుతో అమీతుమీ తేల్చుకోనుంది. ఆ తర్వాత మాట్లాడుతూ ' ఈ రోజు నా ప్రదర్శనపై చాలా సంతోషంగా ఉన్నాను. ఆది నుంచే ఆధిక్యం కొనసాగిస్తూ వచ్చాను. బేసిక్స్‌కు కట్టుబడి ఉంటూ మ్యాచ్ ఆడాను. మొత్తంగా ఈ విజయం ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. ప్లేయర్ల కెరీర్‌లో ఒడిదొడుకులు సహజం. వయసును బట్టి మనలో ఫిట్‌నెస్ స్థాయి మారుతూ ఉంటుంది. అందుకు తగ్గట్లు మార్పులు చేసుకోవాలి' అని అంది.

## భారత్‌కు పరాభవం.. యూత్ ఆసియాకప్‌లో పాకిస్థాన్ చేతిలో ఓటమి



దుబాయ్: అండర్-19 యూత్ ఆసియాకప్‌లో భారత్‌కు పరాభవం ఎదురైంది. శనివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 43 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. పాక్ నిర్దేశించిన 282 పరుగుల లక్ష్యఛేదనలో యువ భారత్ 47.1 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. నిఖిల్‌కుమార్(67) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది. ఐపీఎల్‌లో 1.10కోట్లు పలికిన 13 ఏండ్ల వైభవ్(1) ఘోరంగా నిరాశపరిచాడు. అలీ రజా(3/36), అబ్దు ల్(2/46) రాణించారు. తొలుత ఓపెనర్ షహజాబ్ (159) సెంచరీకి తోడు ఉస్మాన్(60) ఆకట్టుకోవడంతో పాక్ 50 ఓవర్లలో 281/7 స్కోరు చేసింది. నాగరాజ్(3/45), ఆయూశ్(2/30) రాణించారు.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.